# పచ్చనాకు సాక్షిగా

## పని మీదనే గదా కలవరమంతా......!

మా అమ్మ ఒక్కల ముక్కల కోకగట్టి, ఒక్కల ముక్కల రైక వేసుకొనినా-ఆమిగాని ఆ చేతికి ఎనిమిది, ఈ చేతికి ఎనిమిది లెక్కన పచ్చరంగు గాజులుగాని పెట్టించుకొనింది అంటే - మాసేదానికి కొళ్ళగా వుండేది. మా అమ్మ చేతులు కట్టెవే అయినా, ఆమి చేత లకు గాజులు బలే అమిరేవి. అంతా సరేగాని, ఆ పనిమీదా ఈ పనిమీదాపడి అల్లాడి జనులచేత దిష్టి పెట్టించుకొనే మా అమ్మ - మన చేత లకు గాజులుండాయో లేవో అని నిదానం మీద మాసుకొని, యెచ్చిరికతో వుండి, పొలుమారకుండా పెట్టించుకుంటే గదా! నాయాలీ సీమ, ఎంత దరిద్రంలో వుండినా మటుకు-గాజులకు కూడా వాచిపోయి వుండామా మేము! మంచి మద్యానం, కూచంద్రపేట నుంచి వచ్చి మా వూళ్ళో గాజులమ్ముకునే గాజలాయనకు ఒక మానిడు వడ్లు యేసి, మేము తినే సంగటే ఒక ముద్ద పెడితే-ఆయన మా అమ్మ కోరిన రకాలను మాపిచ్చి, ఏ రకం గాజులు కావాలంటే ఆ రకం గాజులను పెట్టించుకోవచ్చుగదా! గాజుల కాడనా మనం మిగలబెట్టి పొయ్యేటప్పుడు మనకూడా మూట గట్టుకోని పోబొయ్యేది? మా అమ్మ చేత ల్ని మొగోడికి మాదిరిగా ఇకారంగా, మొండిగా పెట్టుకొని, గలగల మనకుండా కలుపు తీస్తావుంటే మా నాయిన- "యిప్పుడుండే బైసాట్లు చాలక యిదొక కొత్తరకం బైసాట్లా? ఆ చేత లకు నాలుగు గాజల్ను కూల్చేయ్యేమి?" అని మా అమ్మను కసురుకోలేక బారడు పొడుగు నిష్టూరం పొయ్యేవాడు. ఈమాత్రం మాట మా నాయిన అనినందుకు మా అమ్మ 'ఓ' అని కుశాలపడి, "ఇంగ బతక్కపొయ్‌నా పరవాలా నేను! మీ నాయినకు గూడ నామింద గేపకం పడింది గదరా సినబ్బా!" అని నాతో ముదిగారానికి పొయ్యేది. నేను గూడా మా నాయినకు సపోరటుగా నిలబడి, "లేకుంటే నీకు మాత్రం ఎట్ట సగిస్తిందమా, బంగారట్టా చేతల్ని ఆ మాదిరితో మొండిగా అయ్యోమంటా పెట్టుకొనే అందుకు!" అని మా అమ్మను దండించేవాడ్ని. ఈ మాటలకు మా అమ్మ ఈ కలిగ్గాన ఎక్కడా వుండవి గొంతును తెమ్చుకొని, "ఓయబ్బో! అబ్బా గొడుకులిద్దరూ ఈ దినం నామింద యాడలేని కలవరం బెట్టుకున్నారే! అంత మొగలాయిలే అయితే ఆ చేతికి రెండు, ఈ చేతికి రెండు బంగారు గాజులు చెయ్యించండేమి, పెట్టుకుంటా. ఈ మట్టివి వీటికి మాటికి సిటక్‌పటక్‌మని పగిలిపోతాగదా వుండాయి" అనేది. ఆ మనిసితో యింగేమి మాట్లాడలేక మా నాయిన గనిమఎక్కి-ఎద్దల్ను నీళ్ళు తాపాలనే సాకు ఒకటి వుండాదిగదా, ఆయనకు- పొయ్యేవాడు. ఇన్ని మాట్లాడి నాకు గూడా నే నొక్కడ్ని మా అమ్మ చేత లకు చిగలక పొయ్యేవాడ్ని.

ఎప్పుడో ఆర్నెల్లకు, సమ్మచ్చరానికి గాజులు పెట్టుకొనే మా అమ్మ - కుంకాన్ని మాత్రం దినమ్మూ ఏమారేదిగాదు. మా అమ్మ మొకాన్ని మీరు ఎప్పుడన్నా వచ్చి మాసుకుందురు రండి- కుంకుంబొట్టు ఎండకు, కష్టానికి కారతానో, లేకుంటే ఒద్దిగ్గానో మా అమ్మ నొష్టన వుండనే వుంటాది. మా ఇంట్లో, మాదీ గూడులో సందేళ సందేళ మండతా వుండే ఇత్తరి దీపింకు ఆ కొనావా, ఈ కొనానా ఎప్పుడు బట్టినా కుంకం వుండినట్టే- మా అమ్మ మొకాన గూడా ఎప్పుడూదా బొట్టు వుండును. అవితే, మా అమ్మ పెండ్లి జేసుకున్నప్పుడు కాళ్ళకు యెండి మట్టెలు పెట్టుకొని వుంటాది గదా! వాటిని ఆ మనిసి ఎప్పుడు ఎక్కడ నీగేసిందోగాని- అప్పట్నించి ఎన్ని కొనినా అవి మా అమ్మ పాదాలకు వుండాటంలా. నేనూ, మా అమ్మ- అందరం అడుసు కయ్యల్లో పరిచిన ఆకుమండల్ని తొక్కతాం గదా - మా అమ్మ మళ్ళ గనిమ ఎక్కినాక మాసుకోని, "ఒరే సినబ్బా! అడుసులో యాడనో మట్టెలు నీగేసుకున్నానురా! ఎట్టరా వీటితో" అని నవ్వుమొకంతో మాట్లాడేది. వాటిని నీగేసిన మా అమ్మ మీద నేనుగూడా ముదిగారంతోనే బారడు నిష్టూరం పోయి, "వుందు, వాటిని-అయికోరట్లో దావా యేసి-కోరటకు ఈడద్దారి!" అనేవాడ్ని.

ఆ పసిబిడ్డ మొకం దానితో అంతకన్నా ఏం మాట్లాడుదుము?

**నామిని సుబ్రహ్మణ్యం నాయుడు**

---

## కాలమ్ దాటని కథ



### దొంగ దొరికాడు

భార్య పుట్టింటికి వెళ్ళడం చేత ఆ ఇంట్లో గోపాలం ఒక్కడే వుంటున్నాడు. ఆ రోజు ఆదివారం కావడం చేత ఉదయం నుంచీ ఇంట్లోనే కూర్చుని, వారపత్రికలు ముందేసుకుని, రేడియోలో వచ్చే వచ్చు, పుచ్చు కార్యక్రమాలు వింటూ కాలక్షేపం చేస్తున్నాడు. సాయంత్రం 6 గంటలైంది. కరెంట్ పోయింది. ఇక ఇంట్లో కూర్చుని చేసేదేమీ లేక అలా బజార్లోకి వెళ్ళివద్దామని బైలుదేరాడు. కొంతదూరం వెళ్ళేసరికి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర లైన్ బాగుచేస్తూ కన్పించారు. కరెంట్ ఇప్పుడప్పుడే రాదని తెల్సుకొని ఏదైనా సినిమాకు పోదామని నిశ్చయించుకొని థియేటర్ వైపు నడవసాగాడు.

గోపాలం ఇంట్లో లేడని తెల్సుకొని ఆ ఏరియాలో దొంగతనాలు చేస్తున్న గంగారాం 8 గంటల ప్రాంతంలో గోపాలం ఇంటి తాళం బద్దలు కొట్టి ఇంట్లో జొరబడ్డాడు. ఇంట్లోకి ప్రవేశించగానే బీరువా ఒకటి దర్శనమిచ్చింది. తన దగ్గరున్న తాళం చెవులతో బీరువా తెరవడానికి ప్రయత్నించసాగాడు, మోకాళ్ళపైన క్రింద కూర్చుని. వెనక టప్‌మని లైటు వెలిగిన శబ్దానికి 'ఈ గోపాలంగాడు అప్పుడే వచ్చేసాడా ఖర్మగాలి' అనుకుంటూ ఉలిక్కిపడి లేచిన గంగారాం వెనక్కి తిరగబోయాడు.

"కదలకు, చేతులెత్తివుంచు... ఏ మాత్రం కదిలినా ఈ పిస్టల్‌లోని గుళ్ళు నీ శరీరంలోకి దిగబడతాయి" అన్న గర్జన వినపడ్డది.

'ఓరి దేముడోయ్' అనుకుంటూ చేతులెత్తి వుంచాడు గంగారాం.

"ఊఁ!అలాగే ఎడమవైపు తిరిగి నీ ముందున్న గదిలోకి నడు" అన్న మాటలు వినపడ్డాయి. గంగారాం ముందుకు ఎడమవైపు గదివైపు నడిచాడు. వెనకనే అడుగుల చప్పుడు వినపడ్డది.

"వాకిలి తెరువ్" అన్న గర్జన వినపడ్డది. వాకిలి తెరిచి లోన అడుగుపెట్టిన గంగారాం నెత్తిన "ఫట్"మని పడిందో దెబ్బ! స్పృహ తప్పుతుండగా అటకపైనుంచి నెత్తిమీదకి, అక్కడి నుంచి నేల మీదికి పడి తువాతువక లైన పింగాణీ జాడీ కన్పించుతుండగా "ఆకాశవాణి-'దొంగ దొరికాడు'- నాటిక విన్నారు" అంటూ లీలగా రేడియో విన్పించింది.

— జి. రంగబాబు